వరద.. వణుకు

- మళ్లీ నిండుకుండలా నీటిప్రవాహం
- లంక భూములు, గ్రామాలకు పొంచి ఉన్న ముంపు భయం


కరకట్ట రహదారి వైపు చొచ్చుకువస్తున్న వరద

కంకిపాడు: కృష్ణమ్మ మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఇరిగేషన్ అధికారులు ప్రకాశం బ్యారేజీ గేట్లు పూర్తిగా ఎత్తి వరదనీటిని సముద్రంలోకి విడుదల చేశారు. మంగళవారం రాత్రికి 4.87 లక్షల క్యూసెక్కుల వరదనీటిని సముద్రంలోకి విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. నిన్నటి వరకూ స్థిరంగా కొనసాగిన వరద మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. కృష్ణానది పాయ నిండుకుండలా మారింది. వరదనీటితో పొంగి పొర్లుతోంది.

ఒడ్డుకు చేరిన పడవలు

పెనమలూరు నియోజకవర్గంలోని యనమలకుదురు, పెద పులిపాక, చోడవరం, కంకిపాడు మండలం కాసరనేనివారిపాలెం, మద్దూరు వెంబడి ప్రవహిస్తున్న ఏటిపాయ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులు క్రితం వరకూ ఏటి పాయలోపలికే పరిమితమైన వరదనీటి మట్టం మంగళవారం పెరిగింది. ఏటిపాయ నుంచి కరకట్ట వైపునకు వరదనీరు చొచ్చుకువస్తోంది. ఏటి వెంబడి గ్రామాల్లోని మత్స్యకారులు తమ పడవలు, వలలను ఏటి ఒడ్డుకు చేర్చి భద్రపర్చుకున్నారు.

పొంచి ఉన్న ముంపు భయం

ఏటిపాయ పోటెత్తటంతో పాయ వెంబడి సాగులో ఉన్న పంట పొలాలకు ముంపు భయం పొంచి ఉంది. మద్దూరు వద్ద ఏటిపాయలోని లంక భూములైన పుచ్చలలంక ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా నీటమునిగి ఉంది. దీంతో లంక భూముల్లోకి వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది. రెండు రోజులు క్రితం వరకు పడవలను ఆశ్రయించి పొలాలకు వెళ్లిన రైతులు, కూలీలు ప్రస్తుత నీటి ఉధృతికి రాకపోకలు నిలుపుదల చేసుకున్నారు. వరదనీరు పొంగి పొర్లుతుండటంతో అధికారులు ఏటిపాయ వెంబడి బందోబస్తు చర్యలు కట్టుదిట్టం చేశారు. ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో కరకట్ట వైపు ఉన్న పంట పొలాలు, లంక భూములకు ముంపు భయం పొంచి ఉందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. తోట్లవల్లూరు మండల పరిధిలోని ఏటిపాయలో ఉన్న లంక గ్రామాల ప్రజలు వరద ఉధృతి పెరిగే ప్రమాదం ఉందన్న ప్రచారంతో బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు.


మద్దూరు వద్ద ఏటి ఒడ్డున చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుడు

ఏటి ఒడ్డున చేపల వేట

ఇదిలా ఉంటే మరికొందరు మత్స్యకారులు కనీసం తమ కుటుంబ జీవనం కోసం ఏటి ఒడ్డును ఆశ్రయిస్తున్నారు. ఏటి ఒడ్డున చేపల వేట సాగిస్తున్నారు. వలలకు చిక్కిన చేపలను కరకట్ట రహదారిపై విక్రయించుకుంటున్నారు. వరదతో తమ జీవనోపాధికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరకట్ట దిగువ నివాసితుల్లో టెన్షన్

- పెదపులిపాకలో వణికిస్తున్న కృష్ణానది
- నది అంచుకు చేరిన వరద నీరు

పెనమలూరు: కృష్ణానదికి ఈ వారంలో రెండవ సారి వరద వచ్చింది. నదికి వరద రావటంతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో కరకట్ట దిగువన నివాసం ఉంటున్న వారు ఆందోళన చెందుతున్నారు. నదిలో వరద కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని కంగారు పడుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దాదాపు 4.87 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వదిలారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం ఘాట్‌ల వద్దకు వరదనీరు భారీగా చేరుకుంది. పెదపులిపాక, యనమలకుదురు గ్రామాల పరిధిలో కరకట్ట దిగువన నివాసాలు ఉండటంతో వరదతో నివాసితులు ఆందోళన చెందుతున్నారు, వరద మరో లక్ష క్యూసెక్కులు పెరిగితే కరకట్ట దిగువన ఉన్న నివాసాల్లోకి వరద నీరు ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో నివాసితులు ఆందోళనలో ఉన్నారు.


నివాసాల వద్ద నది గట్టు వరకు వరద నీరు

అధికారుల సూచన

నదికి వరద పెరుగుతుండటంతో కరకట్ట దిగువున ఉన్న నివాసితులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు. ముందుగానే నివాసాలు ఖాళీ చేయాలని సూచిస్తున్నారు. నివాసితులు మాత్రం ఇళ్లు వదలటం లేదు. వరద మరింత పెరిగితే ప్రమాదం పొంచి ఉంది. నదికి వరద రావటంతో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి.

బుడమేరు పాతవంతెన వద్ద రోడ్డుకు గండి

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతం బుడమేరు పాత వంతెన వద్ద గండ్లు పెట్టారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వదర నీటితో బుడమేరు పాత వంతెన ముంపునకు గురైన విషయం తెలిసిందే. వరద ప్రవాహంతో బుడమేరు సమీప నివాసాలు, పంట పొలాల్లోకి నీరు చేరుకుంటోంది. పాతవంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. వరదనీరు సాఫీగా ప్రవహించేందుకు వంతెనకు రెండు వైపులా జేసీబీతో గండ్లు తవ్వించారు. దీంతో వంతెనపై నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.

వ్యర్థాల తొలగింపు

ఈ వంతెన వద్ద చెత్త, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. ఒక వైపు వరదనీరు మరో వైపు ఈ చెత్త గుట్టలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యర్థాల గుట్టలు రోడ్డుపై దిబ్బలుగా పేరుకుపోవడంతో వీటి తొలగింపు అధికారులకు తలనొప్పిగా మారింది. జేసీబీతో చెత్తను ఎత్తించి లారీల ద్వారా తొలగిస్తున్నా మరలా భారీగా చెత్త వచ్చి చేరుకుంటోంది. ప్రస్తుతం వంతెన రోడ్డుపై పేరుకుపోయిన చెత్తతొలగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.


రామవరప్పాడు బుడమేరు పాత వంతెన వద్ద పెట్టిన గండి


వంతెన రోడ్డుపై వ్యర్థాల గుట్టలు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



పెనమలూరు: పోరంకి గ్రామంలో ఇటీవల వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కొమరవోలు అప్పలనాయుడు అనారోగ్యంతో మృతి చెందటంతో ఆతని కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం అందించింది. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చక్రవర్తి ఇచ్చిన రూ.10 వేలను టిడ్కో మాజీ డైరెక్టర్ పి.రాఘవరావు, పార్టీ నేతలు కలిసి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బొర్రా కృష్ణ, అద్దేపల్లి చందు, చంద్రాల మోహన్‌రావు, బొర్రా రమణయ్య, దేవినేని పున్నయ్యచౌదరి, ఉప్పల వీరబాబు, గుడికందుల శివకోటి, ముచ్చు నాగేంద్ర, పలువురు నేతలు పాల్గొన్నారు.

పాఠశాలకు యాంప్లిఫైర్ అందజేత




గన్నవరం రూరల్: పూర్వవిద్యార్థుల సహకారం ఎంతో అభినందనీయమని ముస్తాబాద జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం ఎస్.నాగవేణి అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలకు 1981–82 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.20 వేల ఖర్చుతో యాంప్లిఫైర్‌ను అందజేశారు. దీని సహాయంతో పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులకు సూచనలు, సలహాలు, మార్గదర్శనం చేయటం సులభం అవుతుందని హెచ్‌ఎం నాగవేణి చెప్పారు. పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిదని ప్రత్యేకంగా అభినందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద పరిస్థితులను పరిశీలించిన అధికారులు



పెనమలూరు: కృష్ణానది వరద పరిస్థితిని ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి మంగళవారం పరిశీలించారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు దిగువకు వదలటంతో మండల పరిధిలో యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాలకు ముంపు ప్రమాదం ఉండటంతో పరిస్థితులను ఆమె సమీక్షించారు. వరద పెరిగి నివాసాల్లోకి నీరు ప్రవేశిస్తే నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రమాదం హెచ్చరికగా మైక్‌తో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపులిపాక సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, డెప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తిరుమల వెంకటరత్నం, వీఆర్వో సాయితేజ, పలువురు పాల్గొన్నారు.

యూరియా కొరతకు నిరసనగా రైతు సంఘాల ధర్నా



గన్నవరం: ఖరీఫ్ సాగు అవసరాలకు అనుగుణంగా రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుందని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. స్థానిక వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుల కార్యాలయం ఎదుట మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో యూరియా కొరతకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ.. ఖరీఫ్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వం యూరియా సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొంత మంది ప్రైవేట్ ఎరువుల దుకాణదారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. యూరియాకు బదులుగా అవసరం లేని ఎరువులను రైతులకు అంటగడుతూ దోచుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన యూరియా నిల్వలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఐ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషి, రైతు సంఘ నేతలు గొంది శోభనాచలపతిరావు, వెంగళ శివయ్య, కొలుసు శ్రీమన్నారాయణ, ఎం.ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై డీఎస్పీ విచారణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఒంటరిగా ఇంట్లో ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దొంగ బలవంతంగా లాక్కుని పరారైన ఘటనపై గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్ మంగళవారం వివరాలు ఆరా తీశారు. స్థానిక ఐటీఐ రోడ్డులోని వృద్ధురాలు వీరమాచినేని సుశీల ఇంటికి వచ్చిన డీఎస్పీ శ్రీనివాస్ పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో నిద్రిస్తుండగా లోనికి చొరబడిన దుండగుడు మెడలోని బంగారు గొలుసు అపహరించేందుకు యత్నించాడని బాధితురాలు వాపోయింది. ప్రతిఘటించేందుకు ప్రయత్నించటంతో బంగారు గొలుసు తెగిపోయి చిన్న ముక్క తన చేతిలో మిగిలిపోయిందని, దుండగుడి చేతికి చిక్కిన బంగారు గొలుసుతో వెంటనే బైక్‌పై పరారయ్యాడని సుశీల తెలిపింది. దుండగుడు రెయిన్ కోట్ ధరించి, ముఖానికి మాస్క్ కట్టుకున్నాడని చెప్పారు. దొంగను పట్టుకునేందుకు సీసీ కెమేరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని, సాధ్యమైనంత వేగంగా కేసును ఛేదిస్తామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ ఉన్నారు.

ఇన్‌చార్జి కార్యదర్శిగా శ్రీనివాసరావు

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా అంబాపురం కార్యదర్శి డి.శ్రీనివాసరావును నియమించినట్టు డెప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. పాతపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన పి.కోటిలింగమ్మను ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి బదిలీ చేయగా ఆస్థానంలో ఇన్‌చార్జి కార్యదర్శిగా శ్రీనివాసరావును నియమించారు.

నీటమునిగిన వరినాట్లు

గన్నవరం రూరల్: మండలంలో గత నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లోని వరినాట్లు నీటమునిగాయి. మండలంలో 17 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. అయితే రైతులు 60 శాతంపైగా నాట్లు పూర్తి చేశారు. నీటమునిగిన వరినాట్లలో నీటిని బయటకు పంపే పనిలో రైతులు నిమఘ్నమయ్యారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోవటంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వీఏఏలు కూడా వరినాట్లను పరిశీలన చేసి సూచనలు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేత గన్నవరం-1

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్, వాలీబాల్ సీనియర్ క్రీడాకారుల సంయుక్త ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిడమానూరు జట్టుపై వరుసగా రెండు సెట్లలో విజయం సాధించి గన్నవరం–1 జట్టు విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లెథర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు చేతుల మీదుగా నగదు బహుమతులను, షీల్డ్‌ను ప్రధానం చేశారు. మొదటి స్థానం సాధించిన గన్నవరం–1 జట్టుకు గూడపాటి అశోక్‌కుమార్ రూ.10 వేలు, రెండవ స్థానంలో నిలిచిన నిడమానూరు జట్టుకు న్యాయవాది తిరివీధి వెంకయ్య రూ.6 వేలు అందజేశారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన గన్నవరం–2 జట్టుకు ఎంఎన్.చౌదరి రూ.3 వేలు, కేసరపల్లి జట్టుకు విశ్రాంత సైనిక ఉద్యోగి డి.సర్వేశ్వరరావు రూ.2 వేలు నగదు పంపిణీ చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు విశ్రాంత విమానాశ్రయ డైరెక్టర్ ముక్కామల సుబ్బారావు సౌజన్యంతో బహుమతులు అందజేశారు. అనంతరం మాణిక్యాలరావు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. క్రీడాకారులను ఆయన అభినందించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్ నేతృత్వంలో జరిగిన ఈ పోటీల్లో సర్పంచి నిడమర్తి సౌజన్య, విశ్రాంత పీడీ టీఎస్ఆర్‌కే. ప్రసాద్, గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కెఎస్.జగదీశ్వరరావు, వాకర్స్ ప్రతినిధులు కేఎస్.బాబూరావు, చల్లపల్లి శ్రీనివాసరావు, బీ కోటేశ్వరరావు, సగ్గుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రథమ బహుమతి అందుకుంటున్న గన్నవరం-1 జట్టు క్రీడాకారులు

పాలిటెక్నిక్ కళాశాలకు కంప్యూటర్లు బహూకరణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్, తేలప్రోలు శాఖలు సంయుక్తంగా రూ.76 వేల విలువైన రెండు కంప్యూటర్లను బహూకరించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వీవీపీఎస్. ఆంజనేయులు చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. సాంకేతిక విద్యారంగానికి లయన్స్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతను విద్యార్థులు నేర్చుకునేందుకు రెండు కంప్యూటర్లను అందజేసినట్లు చెప్పారు. వీటిని వితరణ చేసిన దాతలు మెడివ్యాలి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ లయన్ పంచకర్ల రమేష్ చక్రవర్తి, లయన్ మోదుగు భానుసుందర్ కుమార్‌ను అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు, ప్రజలకు విద్య, వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ పని చేస్తుందన్నారు. లయన్స్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు సేవా దృక్పథం కలిగిన ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు. లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్లు ఎస్‌వీపీఎస్.ప్రసాద్, సీహెచ్. శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీవీ.కృష్ణమోహన్, హనుమాన్‌జంక్షన్, తేలప్రోలు లయన్స్‌క్లబ్ శాఖలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.


పాలిటెక్నిక్ కళాశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

రాధాకృష్ణన్ ప్రతిభ అవార్డులకు ఎంపిక

గన్నవరం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభ పురస్కారాలకు స్థానిక స్రవంతి హైస్కూల్‌కు చెందిన ఇరువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సదరన్ ప్రైవేట్ లెక్చరర్, టీచర్స్ ఆర్గనైజేషన్, కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ అందజేయనున్న ఈ అవార్డులకు తమ పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు సింగిరెడ్డి నాగరాజు, బాపట్ల అశోక్‌ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 31న జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరికి అవార్డులను అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు, అశోక్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించినట్లుగా పేర్కొన్నారు.


సింగిరెడ్డి నాగరాజు


బాపట్ల అశోక్

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాత వారరవీంద్ర (విశాఖపట్టణం) సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతుల పరిశీలన



మానికొండ(గన్నవరం): ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలోని జగనన్న కాలనీలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘ నేతలు పర్యటించారు. కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులను పరిశీలించడంతో పాటు కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ కాలనీలో 400 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించగా ఇప్పటికే 300 మంది గృహ నిర్మాణాలు చేసుకున్నట్లు తెలిపారు. అంతర్గత రహదారులను అభివృద్ధి చేయకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రోడ్లన్నీ బురద మయంగా ఉండడంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయలను కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ నేతలు మేక పార్వతీశ్వరరావు, కిరణ్, రాము, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే



గన్నవరం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ముస్తాబాద పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఆత్కూరు పీహెచ్‌సీ పరిధిలోని తెంపల్లి, బల్లిపర్రు గ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే జరిగింది. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఆశా వర్కర్‌లు దుర్గా, మేరీ పాల్గొన్నారు.

నానో యూరియా వాడాలి ఏడీఏ సునీల్



పెనమలూరు: ప్రస్తుత పరిస్థితిలో యూరియాకు ప్రత్యామ్నయంగా నానో యూరియా వాడాలని ఏడీఏ సునీల్ అన్నారు. మండల పరిధిలోని పెదపులిపాక గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సునీల్ మాట్లాడుతూ యూరియా సమస్య ఉన్నందున రైతులు నానో యూరియా పంటకు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఎకరాకు 500 ఎంఎల్ నానో యూరియా ద్రావణంలో వందలీటర్ల లీటర్ల నీరు కలిపి పిచికారి చేయాలన్నారు. వరి దుబ్బు దశలో ఉన్నందున ఎటువంటి పురుగుల మందులు వాడరాదన్నారు. మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ మాట్లాడుతూ అన్నదాత సుఖీభ పథకం సాయం అందని వారు ఈ నెల 20వ తేదీ నాటికి రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు


కాలనీలోని అంతర్గత రోడ్లులో వర్షం నీరు

గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు అంతర్గత రోడ్లు ముంపునకు గురికావడంతో పాటు బురదమయం అయ్యాయి. దీంతో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లోకి వర్షం నీరు చేరి మురుగునీటి తటాకాలుగా మారాయి. దీని వల్ల దోమల ఉధృతి పెరిగి వ్యాధుల బారినపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కాలనీలోని డ్రెయిన్లలో పూడికలు తొలగించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– వీఎస్.పురం కాలనీ(గన్నవరం)


బురదమయంగా మారిన రోడ్డు


ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ

పెనమలూరు: పెనమలూరు చెరువు కట్టపై చాలా సంవత్సరాలుగా నివాసం ఉంటున్నవారికి పొజిషన్ సర్టిఫికెట్‌లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 35 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ గోపాలకృష్ణ సమక్షంలో పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, తోటకూర ఉదయ్‌భాస్కర్, మోర్ల నరేంద్ర, మోటపర్తి రామకృష్ణ, పలువురు పాల్గొన్నారు.

